ప్రకాష్‌గౌడ్‌కే పట్టం కట్టిన ప్రజలు

వరుసగా నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలుపు



మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా ప్రకాష్‌గౌడ్‌నే గెలిపించారు. నియోజకవర్గం ఏర్పడిన 2009 నుంచి వరుసగా ఓటమి ఎరుగని నాయకుడిగా నిలిచి ఏకంగా నాల్గోసారి గెలుపొందారు. మూడుసార్లు మెజార్టీ పెంచుకుంటూ.. వచ్చిన ఆయన 50,591 నుంచి 32,305 ఓట్లకు మెజార్టీ తగ్గింది. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో ఆశించిన మేర ఓట్లు రాకపోయినా బండ్లగూడ, రాజేంద్రనగర్, శంషాబాద్, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌లలో వచ్చిన ఓట్లతో ఆ స్థాయి మెజార్టీ వచ్చింది.

◆ మొదటి రౌండ్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ లీడ్‌లో నిలిచారు. రెండో, మూడో రౌండ్‌లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ లీడ్‌లో నిలిచారు. తరువాతి రౌండ్‌ల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ తన లీడ్ పరంపరను కొనసాగించారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగానే కాంగ్రెస్ అభ్యర్థి రెండో స్థానానికి వచ్చి బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ మొదటి స్థానానికి చేరుకున్నారు. చివరి వరకు మొదటి స్థానంలో నిలిచారు. శంషాబాద్ మండలం ఓట్లను లెక్కించకముందు రెండోస్థానంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి వాటి ఫలితాలు రాగానే మూడో స్థానానికి తగ్గారు.

అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఇవే..

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే స్థానానికి జరిగిన ఎన్నికల్లో మొత్తం 5,81,937 ఓట్లు ఉండగా.. అందులో 3,24,917 ఓట్లు పోలైన విషయం తెలిసిందే. ఇందులో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌కు మొత్తం 1,21,283 ఓట్లు వచ్చాయి. రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డికి 88,978 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌కు 81,055 ఓట్లు, ఎంఐఎం పార్టీ అభ్యర్థికి 25,645 ఓట్లు వచ్చాయి. మొత్తం 25 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. నాలుగు ప్రధాన పార్టీలకు తప్ప మిగతా స్వతంత్ర అభ్యర్థులకంటే ఎక్కువగా నోటాకు 1819 ఓట్లు వచ్చాయి.



విజయోత్సవాల్లో నార్సింగి, మణికొండ నాయకులు

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో తమ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ నాల్గోసారి గెలుపొందటంతో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాలతో స్థానికంగా ఎమ్మెల్యే గెలుపొందినా రాష్ట్రంలో పార్టీకి అధికారం పోవటం కొంత నిరాశకు గురిచేసింది. అయినా స్థానిక ఎమ్మెల్యే మంచి మెజార్టీతో గెలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పార్టీ సమన్వయ కర్త తలారి మల్లేష్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేష్, మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ నియోజకవర్గంలో అనుకున్న స్థాయిలో మెజార్టీ రాకపోయినా మంచి మెజార్టీతోనే గెలుపొందటం ఆనందంగా ఉందన్నారు. మూడవ సారి బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వం వస్తే హైదరాబాద్‌తో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించేదన్నారు. ఉత్సవాల్లో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోకాపేట కౌన్సిలర్ శివారెడ్డి



గౌలిదొడ్డిలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

డిపాజిట్ కోల్పోయిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

రాజేంద్రనగర్: నియోజకవర్గ బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు తమ డిపాజిట్లను కోల్పోయారు. మజ్లిస్, బీఎస్పీతో సహా ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ ధరావత్తును కోల్పోయారు. కేవలం బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు తప్పా... పోటీ చేసిన 22 మంది అభ్యర్థులు తమ డిపాజిట్లను కోల్పోయారు. మొత్తం 3,24,917 ఓట్లు పోలయ్యాయి. దీంట్లో 16 శాతం ఓట్లు వచ్చిన వారికే డిపాజిట్లు దక్కుతుంది. మజ్లిస్ పార్టీ, బీఎస్పీతో సహా స్వతంత్రులెవరికీ 16 శాతం ఓట్లు పోలు కాలేదు. వీరంతా డిపాజిట్లు కోల్పోయారు.

నోటాకు 1819 ఓట్లు



రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలోని దాదాపు 1819 ఓటర్లు నోటాకు ఓటు వేశారు. గతనెల 30న జరిగిన శాసనసభ ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లు పెద్దసంఖ్యలో బరిలో నిలిచిన అభ్యర్థులను కాకుండా నోటాకు ఓటు వేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు మొత్తం 25 మంది ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ వారందరికి తమ ఓటు కాదని... నియోజకవర్గానికి చెందిన 1819 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో నోటాకు మొత్తం 1819 ఓట్లు వచ్చాయి.

హ్యాట్రిక్‌తో సంబరాలు



ప్రకాష్‌గౌడ్‌ను ఎత్తుకుని శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లార్డ్స్ కళాశాలలో నిర్వహించిన కౌంటింగ్‌హాల్‌కు ఆయన చేరుకున్న సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఆయనను ఎత్తుకుని శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తీర్పును గౌరవిస్తా.. !



తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల తీర్పును శిరసా వహిస్తామని, ఓటమికి కుంగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు దగ్గరవుతానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో మాట్లాడుతూ.. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని రెట్టింపు ఉత్సాహంతో ప్రజలతో అన్ని వేళలు ఉంటానన్నారు. ఈ పోరాటంలో తన వెన్నంటి నడిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ శ్రేణులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ఓటమి భవిష్యత్తులో గెలుపునకు నాంది పలుకుతుందన్నారు.

సంగం శ్రీరాముడిని దర్శించుకున్న నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే



లంగర్‌హౌస్: నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన నీలం సంజీవరెడ్డి ఆదివారం రాత్రి లంగర్‌హౌస్ సంగంలోని శ్రీరామ చంద్రుడిని దర్శించుకున్నారు. ఆదివారం విజయం సాధించిన అనంతరం ఆయన నగరంలోని జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయానికి వచ్చారు. పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం భరతనాట్య కళాకారిణి అనూష తన ప్రదర్శనతో అలరించింది. ఇందులో మేళప్రాప్తి, కృతి, రారా రాజీవలోచన, పదం, శ్రీసరస్వతీ ఆశ్రయామి అంశాలను ప్రదర్శించారు. ప్రముఖ నాట్యగురువు నిర్మలా ప్రభాకర్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో శ్లోకాలు, వినాయకస్తుతి, అలరిపు, శివస్తుతి, త్యాగరాజ కీర్తన, తరంగం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారులు ప్రముఖ గురువు అంజుబాబు, సువర్ణలత, కుసుమ బోగరాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సీనియర్ నాయకులు దత్ మృతి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ సీనియర్ నాయకులు దత్ అనారోగ్యంతో మృతి చెందారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందిన అక్షయ కుమార్ దత్(77) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి 2004లో ఉద్యోగ విరమణ పొందారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్, చైర్మన్, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం హైదరాబాద్ నగరంలో స్థిరపడ్డారు. అప్పటి నుంచి 2021 వరకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తగా పనిచేశారు.ఆయన మృతి పట్ల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది.

ప్రజల మధ్యే ఉంటా : కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

ఓడిపోయానని అధైర్య పడవద్దు



మహేశ్వరం: ఎన్నికల్లో ఓడిన మహేశ్వరం నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉండి సేవ చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ఓటు వేసిన కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎన్నికల్లో అతి తక్కువ సమయంలో చాలా మంది మద్దతుగా నిలవడం ఆనందకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చేలా బాధ్యత తీసుకుంటానన్నారు. పదవులతో సంబంధం లేకుండా మహేశ్వరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాను ఓడిపోయానని అధైర్యపడవద్దని సూచించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

రాజేంద్రనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించడంతో రాజేంద్రనగర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించుకున్నారు. పార్టీ నాయకుడు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సంబరాలు చేశారు. పెద్దఎత్తున టపాసులు కాలుస్తూ.. వాహనదారులు, పాదచారులు, స్థానికులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కోరని శ్యామ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీపై నమ్మకంతో పార్టీ అభ్యర్థులను గెలిపించారన్నారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలు ప్రజల్లోకి వెళ్లాయన్నారు. రాష్ట్రంలో తిరిగి ఇందిరమ్మ రాజ్యం రాబోతుందన్నారు. ప్రజల ప్రభుత్వంలో అందరికి సమన్యాయం ఉంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ అంటేనే ప్రజల పార్టీ అని గుర్తు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న పార్టీ నేతలు

ట్రా'ఫికర్'

- బస్టాపులు, రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- అలంకారప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ
- ఇబ్బందుల్లో జనం



మొయినాబాద్: ప్రధాన చౌరస్తాలో పనిచేయని సిగ్నల్స్

మొయినాబాద్: మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరిగిపోతోంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. ప్రధాన చౌరస్తాలో వాహనాలు ఎటు నుంచి ఎటు పోతున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నాలుగు వైపులనుంచి ఒకే సారి వాహనాలు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాదాచారులు చెబుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా దాన్ని వినియోగించడంలేదు. మరోవైపు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ మహానగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు ప్రధాన సమస్యగా తయారవుతుంది. ప్రధాన రహదారికి ఇరుపక్కల ఉన్న షాపులు, హోటళ్లు, బ్యాంకుల ముందు వాహనాలను ఇష్టం వచ్చినట్లు పార్కుచేస్తున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనాలకు, పాదాచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో ఉదయం పూట వందలాది మంది అడ్డాకూలీలు రోడ్డుపైనే నిలబడతారు. దీంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం ఏర్పడడంతోపాటు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

బస్టాపుల్లో పార్కింగ్...

ఇక్కడ బస్టాపుల్లోనే ఆటోలు నిలుపుతుండడంతో బస్సులు వచ్చి రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీంతో వెనక నుంచి వచ్చిన వాహనాలు, బస్సుల వెనకాలే ఆగడంతో బస్సులు కదిలేంత వరకు ట్రాఫిక్‌లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాపుల వద్దే బ్యాంకులు ఉండడంతో బ్యాంకులకు వచ్చినవారు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. అదే విధంగా రోడ్డుకు ఇరుపక్కల ఉన్న షాపుల ముందు టీ పాయింట్లు, జ్యూస్ బండ్లు, పానిపూరి బండ్లు ఏర్పాటు చేయడంతో షాపుల ముందు పార్కింగ్ స్థలం లేకుండా పోతుంది.

అలంకారప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ...

ట్రాఫిక్ సమస్య తీర్చడంకోసం ప్రధాన చౌరస్తాలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఆ సిగ్నల్స్‌లను వినియోగించడంలేదు. సిగ్నల్ ఆపరేటింగ్ లేకపోవడంతో ప్రధాన చౌరస్తాలో నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు రావడంతో ట్రాఫిక్ జాం అవుతుంది. సిగ్నల్ ఏర్పాటు చేసినా వినియోగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ సోమవారం మొయినాబాద్‌లో సంత ఉండడంతో ఆ రోజు ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు హోంగార్డు ఉంటున్నా కేవలం ఫొటోలు తీసి చలాన్లు వేయడమే పనిగా పెట్టుకున్నారు. హైవే మొబైల్ వాహనం సైతం రహదారిపై తిరుగుతూ ఫొటోలు తీయడమే తప్పా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదు.



మొయినాబాద్: రోడ్డుపై నిలిపిన ఆర్టీసీ బస్సు

మురుగు సమస్య



మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో న్యూ కాలనీ వద్ద..

మియాపూర్ : ప్రధాన రహదారులపై మురుగు ప్రవాహంతో కాలనీవాసులు ఇబ్బందులుపడుతున్నారు. కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామని ప్రజాప్రతినిధులు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కాలనీ, బస్తీలలో మురుగు సమస్యతో ఇబ్బందులుపడుతున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం సరిపోకపోవడం, పాతవి కావడంతో మురుగు నీరు మ్యాన్‌హోల్‌ల నుంచి పొంగి రోడ్లపై ప్రవహిస్తుంది. సమస్యను స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా సంవత్సరాలు గడుస్తున్నా సమస్య పరిష్కారం అవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారి ఏదో నామమాత్రంగా పరిష్కరించి వెళ్తున్నారే తప్ప.. శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

◆ మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూకాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, దత్తసాయి కాలనీ, లక్కి రెస్టారెంట్ వెనుక కాలనీలో మురుగు రోడ్లపై ఏరులై పారుతుంది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్ జేపీనగర్‌లో ప్రధాన రహదారిపై మురుగునీరు రెండు నెలల నుంచి పారుతోంది. మురుగునీటి సమస్యను పరిష్కరించకుండా సీసీ రోడ్డు వేయడంతో మురుగునీరు మ్యాన్‌హోళ్ల నుండి పొంగి సీసీ రోడ్డుపై ప్రవహిస్తుంది

◆ మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో న్యూ కాలనీ వద్ద గత ఆరు నెలల నుండి మురుగునీరు రోడ్డుపై పారుతున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డువెంబడి ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో మురుగునీటిలో నుండే వెళ్లాల్సి వస్తుంది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై మురుగునీరు పడి ఇబ్బందిపడుతున్నారు. పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని వాపోతున్నారు.

◆ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బొల్లారం రోడ్డులో ప్రధాన రహదారిపై ..



లక్ష్మీనగర్ కాలనీలో..